# ఉత్తరాల ఊర్వశి

డా॥ ఎ. యం. రెడ్డి

'టెలిగ్రాం'!

ఆఫీస్‌లోకి వచ్చిన పోస్ట్‌మాన్‌ను చూసి అందరూ ఒక్కసారి పనులాపి హఠాత్తుగా తలలు పైకెత్తారు.

'టెలిగ్రాం ఎవరికోయ్...?' -హెడ్డుగారు ప్రశ్నించారు.

'విజయేంద్ర గారికి సార్'

తలవంచుకుని. శ్రద్ధగా వర్క్ చూసుకుంటున్న విజయేంద్ర గుండెలు ఝల్లుమన్నాయి.

'నా... నాకేనా టెలి...గ్రా...o' మనసులోని కంగారు మాటల్లో స్పష్టంగా ప్రతిబింబించింది.

'అవున్సార్'- సంతకం తీసుకొని టెలిగ్రాం అందించాడు పోస్ట్‌మాన్.

విజయేంద్ర చేతుల్లో టెలిగ్రాం...

శరీరంలో, వేళ్లల్లో సన్నని వణుకు...

'అదేమిట్రా! అలా బొమ్మలా నిలబడి పొయ్యావేం... చించి చదువు...' ప్రక్కసీటు మిత్రుడు రాజారాం హెచ్చరించాడు.

విజయేంద్ర మెల్లగా టెలిగ్రాం కవరు చించి... మనసు చిక్కబట్టుకొని అందులోని పదాలను చదువుకున్నాడు.

'ఆ! !!'

విజయేంద్ర కళ్లు బైర్లుకమ్మాయి. గుండెలు గుబగుబలాడాయి.

మళ్లీ మళ్లీ చదువుకున్నాడు.

ఆఫీసు కొలీగ్సంతా విజయేంద్ర మొహంలోని భావాలు చదవటానికి ప్రయత్నిస్తున్నారు.

'అదేంటోయ్... అలా రాతిబొమ్మలా నిలబడిపొయ్యావు... ఎక్కడినుండి టెలిగ్రాం... యిలాతే...' రాజారావు సీట్లోంచి లేచి వచ్చాడు. యాంత్రికంగా అందించాడు విజయేంద్ర.

'ఆ! !!'

ఈ మారు ఆశ్చర్యపోవటం ఆఫీసులోని వారి వంతయ్యింది. క్షణాల్లో రాజారావు తేరుకున్నాడు.

'డియర్ కొలీగ్స్! మన మిత్రుడు విజయేంద్ర వ్రాసిన కథకు 'దీపావళి కథల పోటీల్లో' ద్వితీయ బహుమతి వచ్చింది...' రాజారావు బిగ్గరగా అనౌన్స్ చేస్తూ 'కంగ్రాచ్యులేషన్స్... మెనీ మెనీ హార్టీ కంగ్రాట్సోయ్...' రాజారావు విజయేంద్రను కౌగిలించుకున్నాడు ఆనందంతో.

ఆ తరువాత పదిహేను నిమిషాల దాకా ఆఫీసంతా ఒకటే సందడి...కోలాహలం...

విజయేంద్ర ఓ వర్ధమాన కథా రచయిత. ప్రేమకథలు వ్రాయటంలో విజయేంద్రకు అద్భుతమైన నేర్పుంది. కేవలం రెండేళ్ల క్రిందటనే కలం పట్టిన విజయేంద్ర... అచిరకాలంలోనే పత్రికారంగంలో తనదైన ఓ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకోగలిగాడు. కానీ- కథల పోటీల్లో బహుమతి రావటం ఇదే ప్రథమం.

'హలో... కంగ్రాచ్యులేషన్స్...' తల వంచుకుని ఊహల పల్లకిలో ఊరేగుతూ ఆఫీసు నుండి బయటకు వస్తున్న విజయేంద్ర హఠాత్తుగా ఆగిపొయ్యాడు.

ఎదురుగుండా జ్యోత్స్న.

ఆ ఆఫీసు కంతటికీ అందాల భరిణ. పుత్తడి బొమ్మ. పెళ్లికాని అందాల పూలరెమ్మ. ఎవ్వరినీ పలుకరించని, కనీసం కన్నెత్తయినా కనికరించని పున్నమి వెన్నెల రేఖ.

ఈ హఠాత్సంఘటనకు విజయేంద్ర గుండెలు లయ తప్పాయి.

'మీ రచయిత లెప్పుడూ ఊహల పల్లకీల్లో తప్ప... మాలాగా నేలపైన నడవరా ఏమిటి... కంగ్రాచ్యులేషన్స్...' వీణ మీటినట్లుగా, సెలయేళ్లు దూకినట్లుగా అందంగా నవ్వింది జ్యోత్స్న.

'థాంక్స్...'

ఆ దృశ్యాన్ని కొలీగ్స్ చూశారు. వాళ్ల కళ్లలో లీలగా అసూయ. వాళ్ల ముఖకవళికల్ని అలవోకగా గమనిస్తూ- గుండెల్నిండా తృప్తిగా, ధీమాగా గాలి పీల్చుకున్నాడు విజయేంద్ర.

విజయేంద్ర ఛాతీ ఒక్కసారిగా ఆరంగుళాలు పెరిగింది.

ఇక్కడ విజయేంద్రను గురించి- అహ- 'విజయేంద్రలోని రచయితను' గురించి ఒక్కమాట చెప్పుకోవాలి... దాదాపు అందరు రచయిత కున్నట్లుగానే విజయేంద్రకూ ఓ బలహీనతుంది... అది అభిమానుల పొగడ్తల్లో కొట్టుకుపోవటమని ప్రత్యేకించి పేర్కొనవలసిన అవసరం లేదు. ఇపుడిపుడే ఎదిగివస్తున్న వర్ధమాన రచయిత విజయేంద్ర క్కూడా ఉత్తరాల అభిమానులు కొందరు లేకపోలేదు.

పాపం! అభినందనలకన్న రచయిత కోరుకొనే మరో కోరికే ముంది...!

వారం రోజుల తర్వాత-

'పోస్ట్-' పోస్ట్‌మాన్ గులాబిరంగు కవరందించి వెళ్లాడు. కవరు మీద దస్తూరి కొత్తగా, గుండ్రంగా, ఆకర్షణీయంగా వుంది. కవరు చించి కాగితం బయటకు తీశాడు. ఖరీదైన సెంటు పరిమళం గుప్పుమంది. అందమైన ఆర్ట్‌పేపర్ మీద... ముత్యాల వరుసల్లో పొందికగా వెలిగిపోతున్నాయి అందాల అక్షరాలు.

విజయేంద్ర మనసు ఉద్విగ్నంగా మారింది.

నా అభిమాన రచయిత విజయేంద్ర గారికి-

నమస్సుమాంజలులు.

దీపావళి సంచికలో మీ కథ 'వెన్నెల కెరటాలు' చదివాను. ఒక్కమాటలో చెప్పాలంటే సింప్లీ సూపర్బ్. మరొక్కమాటలో చెప్పాలంటే అద్భుతం. మీ కథలోని ప్రేమ సన్నివేశాలు, ఆ ప్రేమికుల మధుర సంభాషణలు, కథకు మీరిచ్చిన ముగింపు... ఒక్కటేమిటి- మీ



కావటలో. ప్రతి అక్షరమూ నిజంగా ఓ వెన్నెల కెరటమే. కానీ- వెన్నెలకు లేని తియ్యదనము కూడా... మీ కథలో అణువణువునా దర్శన మిచ్చింది నాకు.

విజయేంద్రగారూ!

మీ అభిమానిగా నాదో చిన్న కోరిక... కాదు కాదు ప్రార్థన. మీరే ఆఫీసులో పని చేస్తుంటారో నా స్నేహితురాలి ద్వారా తెలుసుకున్నాను. కానీ- మీరు ఏ పత్రికవాళ్లకూ మీ ఫోటో యివ్వకపోవటం- నా వంటి అభిమానులకు ఎంతో మనస్తాపం కలిగించే విషయం. నాదో చిన్న రిక్వెస్ట్.

రేపు- మీ ఆఫీసుకు దగ్గరలో నేనూ నా స్నేహితురాలు నుంచుంటాము. మీరు నేవీబ్లూ షర్ట్, వైట్ పాంట్ మీద ఇన్‌షర్ట్‌తో రండి. మా అభిమాన రచయిత ఎలా వుంటారో... కళ్లారా చూచి తరించిపోతాము.

ఈ చిన్న కోరికను దయతో మన్నిస్తారు కదూ...

మీ
అభిమాని
దేవి

ఉత్తరాన్ని మళ్లీ మళ్లీ చదివాడు విజయేంద్ర. విజయేంద్ర మనసు ఆకాశంలో హరివిల్లు మీద ఆనందంగా విహరిస్తోంది.

అభిమాని చిరునామా కనబడుతుందేమోనని, కవరును. ఉత్తరాన్ని మరోమారు పరిశీలించాడు. 'లోకల్ డెలివరీ' స్టాంప్ తప్ప చిరునామా లేదు.

మరునాడు-

నేవీ బ్లూ షర్ట్, తళతళా మెరిసే విమల్ వైట్ ప్యాంట్‌లో ఇన్ షర్ట్ చేసి, ట్రిమ్‌గా తయారై.. సినీ హీరోలా ఆఫీసుకు బయల్దేరాడు విజయేంద్ర. కాళ్లు యాంత్రికంగా రోడ్డు వెంట నడుస్తున్నా మనకు ఎక్సయిటింగ్‌గా. కళ్లు ఆదుర్దాగా 'అభిమాని'ని గాలిస్తున్నాయి. కనబడ్డ అందమైన అమ్మాయి లందర్నీనూ...

రోడ్డు వెంట ఎందరెందరో ముద్దు గుమ్మలు...

మరెంద రెందరో అందాల భరిణెలు....

అర విరిసిన గులాబీల్లాటి ఇన్ని వదనార పిందాల్లో... తన అభిమాని సుందర వదనార వింద మేది...?

ఆఫీసువచ్చింది.

ఆఫీసు మెట్లెక్కుతూ మరో మారు.. ఇంకో మారు... రోడ్డు కేసి కళ్లింత చేసుకుని చూశాడు- వర్ధమాన రచయిత విజయేంద్ర - ఏ అందమైన నయనాలైనా తనకేసి ఆశగా, ఆసక్తిగా, ఆర్ద్రంగా, ఆప్యాయంగా, ఆత్మీయంగా గమనిస్తున్నాయ్యాయని ...

ప్చ్ .. రోడ్డు మీద జనం ఎవరి బిజీలో వారున్నారు.

విజయేంద్ర నిరాశగా ఆఫీసులోకి అడుగు పెట్టాడు.

అంతే!

గుమ్మంలోనే మిరమిట్లు గొల్పుతూ ఓ మెరుపు మెరిసింది. విజయేంద్ర కళ్ల నిండా మెరుపు...

ఆ విద్యుల్లత పేరు జ్యోత్స్న.

'హల్లో.. గుడ్ మాణింగ్...' వీణానాదం పలికింది. ఆశ్చర్యం! ఎప్పుడూ ఎవ్వర్నీ సభ్యత కోసమైనా విష్ చేయని జ్యోత్స్న.

'వెరీ గుడ్ మార్నింగ్...'

విజయేంద్ర శరీరంలో ఏదో తెలియని అలజడి...రక్త నాళాల్లో మునుపెన్నడూ లేని వేగం...

'విజయేంద్రగారూ! మీరీ డ్రస్‌లో ఎంతో బాగున్నారు. స్మార్ట్‌గా హీ మాన్ లా ఉన్నారు..'' జ్యోత్స్న అభినందన

## కాలాతీతం

''కాలాతీత వ్యక్తులు అంటే?''

అలస్యంగా వచ్చే వారు. మినిస్టర్లు, తారలు''

వి.మంజురాణి [హన్మకొండ]

'థాంక్స్ ఎ లాట్.'

అప్పటికే - ఆఫీసులోకిహుషారుగా ఈల పాటల మీద వస్తున్న కొలీగ్స్ గుండెలు అకస్మాత్తుగా లయ తప్పాయి. ఎదురు గుండా ఉన్న దృశ్యాన్ని చూస్తూ. వాళ్ల కన్నుల్లో లీలగా అసూయ పొరలు...'

విజయేంద్ర సీట్లో కూర్చున్నాడే గాని - మనసు నసేమిరా పనిమీద లగ్నం కావటం లేదు. కళ్ల ముందు అభిమాని ఉత్తరంలోని అందమైన వాక్యాలు పదే పదే మెదలుతున్నాయి. చెవుల్లో జ్యోత్స్న అభివందనలు అమృతపు జల్లుల్లై గిలిగింతలు పెడుతున్నాయి.

తనకు తెలియకుండానే ఫైలు నిండా ఏదేదో రాశాడు విజయేంద్ర. స్పృహలోకి వచ్చి చూసుకున్నాడు. ఓ పేజి నిండా దేవి ... జ్యోత్స్న ... జ్యోత్స్న ... దేవి ... అంటూ రాసేశాడు.

ఓ వారం తర్వాత –

ఓ సుప్రభాత న కిటికీలో నుండి పోస్ట్‌మాన్ ఓ కవరు విజయేంద్ర ఒళ్లో పడేలా విసిరేశాడు. గులాబీ రంగు కవరులో నుండి సెంటు వాసనలు గుప్పుమంటున్నాయి.

దేవి .. దేవి... దేవి.

విజయేంద్ర మనసు వశం తప్పింది. ఇప్పుడు దేవి విజయేంద్ర అభిమాని దశనుండి .. విజయేంద్రే 'దేవీ హృదయాభిమాని' దశకు చేరుకున్నాడు.

డియర్ విజయేంద్రా!

నా మాటను మన్నించి నేవీ బ్లూ షర్ట్‌తో వచ్చి నందుకు మీకు హృదయ పూర్వక కృతజ్ఞతలు. కథల్లో ప్రేమలోకాల్ని సృష్టించి పాఠకుల్ని ప్రేమ రసైక ప్రవాహంలో ఓల లాడించే నా అభిమాన రచయిత ఇంత స్మార్ట్‌గా, లవ్లీగా ఉండటం నా అదృష్టంగా భావిస్తాను. అందాన్ని ప్రసాదించినందుకు బ్రహ్మదేవుని, ఇంతటి రచనా ప్రతిభను అందించి నందుకు ఆ సరస్వతికి చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

డియర్ విజయేంద్రగారూ!

నా కోసం మెరిసే మీ కన్నులను గమనించాను. థాంక్స్ .. అదృష్టం తలుపు తట్టే శుభ గడియ అతి త్వరలోనే ఉందని నా మనసు పదే పదే చెబుతోంది. మీ దర్శనం కన్నా నేను కోరుకునే దివ్య వరం మరే ముంది....?

ఈ నెల నా అభిమాన మాస పత్రికలో అచ్చయిన మీ కథ 'ప్రణయ మందాకిని' అద్భుతంగా ఉంది. ఆ కథలో మీకు ఎలాంటి అమ్మాయిల్ని ఇష్టపడ్తారో పరోక్షంగా వ్యక్తీకరించారు.

కలువ కన్నులు, గులాబీ చెంపలు, దొండ పండంటి పెదవులు, తేనె సోనల్లాటి పలుకులు, కోటేరులాటి సన్నని ఇంపైన నాసిక, శంఖం లాటి నాజూకు కంఠం ... అమ్మో! ఆడ పిల్లను.. ఆ పైన మీ వర్ణనలు నేను రాయలేను బాబూ.. ఆహా! అయితే ఆ కథలోని నాయిక లాటి అమ్మాయి కావాలన్న మాట అబ్బాయిగారికి. అమ్మో! ఎంత ఆశ.

ఇప్పటికే నన్ను చూడాలనీ .. మీ మనసులోని భావాలన్నీ అందంగా అక్షరాలుగా మార్చి నీ కందించాలనీ.. ప్రేమ కథా రచయితగా మీ రెంత తహతహలాడి పోతుంటారో .. నేను అర్థం చేసుకోగలను. ... అయినా మరి కొంత కాలం ఆగక తప్పదు. అన్నట్లు వచ్చే వారం నా ఫోటో తప్పక పంపిస్తాను... చూసి మీ అభిప్రాయం నిర్మొహమాటంగా రాస్తారు కదూ ...! ఫోటోతో పాటే చిరునామా కూడా రాస్తాను.

నిరీక్షణమెంతో మధురం కదా!

. మీ దేవి.

ఉత్తరం పూర్తయ్యే సరికి విజయేంద్ర టంపరేచర్ నూటా నాలుగుకు పెరిగింది. గుండె సెకనుకు నూటా పదహారు సార్లు దేవీ నామ జపం చేస్తోంది.

పాపం!

మొన్నటి దాకా తన రచనల... ఆఫీసు.. ఫ్రెండ్స్‌తో బుద్ధిగా, తాపీగా కాలం వెళ్లబుచ్చిన విజయేంద్ర - ఇప్పుడు క్షణమొక యుగంగా, అంక్షయిటీగా, ఏదో చెప్పలేని అనీజీగా, బరువుగా, భారంగా, ఏకాంతంగా.. రోజులు వెళ్లదీస్తున్నాడు. ఏదైనా కథ రాద్దామని ప్రయత్నించినా .. మనసు దేవి చుట్టూ తప్ప కథల చుట్టూ పరిభ్రమించనంటూంది.

'ఏరా విజ్జిగా! ఆఫీసు యెగ్గొట్టి తీరిగ్గా కలలు కంటున్నావా.. బంగారం లాటి ఉద్యోగం కాస్తా ఊడగొట్టించు కుందామనుకున్నావ్రా వెధవాయ్..'' హఠాత్తుగా ఉరిమింది ఓ కంఠం.

విజయేంద్ర హడావుడిగా ఉత్తరాన్ని దాచేస్తూ మంచం దిగాడు.

ఎదురు గుండా నాన్న?

'ఏ.. ఎప్పు...డొచ్చారు ... నా...న్న....'

'ఇప్పుడే తగలడ్డాలే ..... ఆఫీసుకు సెలవు పెట్టిరా .. ఊరెళ్లాలి...'

'ఊ... ఊరా... ఎందుకు నా...న్నా ...'

'ఎందుకేమిట్రా... ఇలానే బెండకాయలా ముదిరి పోతావా ...లక్షణమైన సంబంధం చూశాను ... అమ్మాయి లక్షణంగా ఉంది. ... పైగా లక్ష రూపాయల కట్నం... మీ అమ్మకూ, నాకూ నచ్చింది..... అయినా నువ్వోసారి తగలడి చూడాలి కదా... అందుకు..' తండ్రి చెప్పాడు. కాదు కాదు ... గర్జించాడు.

'నాన్నా! ఈ వారం రోజులూ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉంది. శెలవు ఇవ్వరు గాక ఇవ్వరు ... తర్వాత ఎప్పుడయినా .. ' నసిగాడు.

' ఆ వెధవ ఇన్‌స్పెక్షనూ ఇప్పుడే యేడిసిందీ.. సరే... అలాగే వేగిరం తగలడు...'

విజయేంద్ర నాన్నగారు పని మీద బయటికి వెళ్లారు.

'హమ్మయ్య... గండం గడిచింది...' విజయేంద్ర బరువుగా నిట్టూర్చాడు.

మధ్యాహ్నం ఆఫీసు క్యాంటిన్ దగ్గర జ్యోత్స్న కలిసింది.

''హల్లో, విజయేంద్రగారూ! మీ 'ప్రణయ మందాకిని' చదివాను.''

''ఎలా ఉంది?''

''నిజం చెప్పమంటారా?'' కళ్లు చక్రాల్లా తిప్పుతూ అడిగింది. విజయేంద్ర మనసు ఆ కళ్లచుట్టూ తిరుగు

తోంది చిత్రంగా.

"చెప్పండి."

"మీలాగే స్పోర్టివ్‌గా, పాలిష్డ్‌గా ఉంది. అంతేకా దండోయ్, ఆ కథానాయికలానే కథ కూడా లవ్లీగా ఉంది కూడా."

విజయేంద్రకు ఇంకేమీ వినిపించడం లేదు. తన్మ యత్వంగా, ఆరాధనగా జ్యోత్స్న కళ్లలోకి చూశాడు.

"అదేమిటి? అలా రెప్ప వెయ్యకుండా మరిచారే మిటి?" కిలకిలా నవ్వింది జ్యోత్స్న గలగల సెలయే రులా.

"ఆc! సారీ...."

"ఇట్సాల్‌రైట్! అయినా ఇందులో మీ తప్పేమీ లేదే!"

"అవును. తప్పంతా మీ అందానిదే..." గొణుక్కున్నా డు వర్ధమాన రచయిత విజయేంద్ర.

సరిగ్గా వారం రోజుల తర్వాత -

చల్లని మలయమారుతంలా మరో గులాబీరంగు కవరు.

"డియర్ విజయ్,

క్రితం ఉత్తరంలో మీ కిచ్చిన మాట మేరకు నా ఫోటోను పంపిస్తున్నాను. కానీ అప్పుడే మీ కళ్లతో నా కళ్లు కలపడం..." ఊహూc... సిగ్గండి బాబూ! అందుకే అటు తిరిగి చూస్తున్న ఫోజులో తీయించుకున్న నా ఫోటో పంపిస్తున్నా.

డియర్!

మరో మంచిమాట. నా ఫోటో చూశాక నన్ను కలుసుకో వడానికి మీరెంత తహతహలాడిపోతారో నాకు తెలును. అందుకే నా కిష్టమైన మిమ్మల్ని ఇంకా బాధ పెట్టదల్చు కోలేదు. రేపు ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు లవర్స్ పార్కుకు రండి. నా కిష్టమైన స్కైబ్లూ కలర్ షిఫాన్ చీరలో, మ్యాచింగ్ బ్లౌజుతో, జడలో కనకాంబరా లతో వచ్చికలో కూర్చుని మీకోసం నిరీక్షిస్తుంటాను.

అది మనిద్దరం ఒకరినొకరు కలుసుకునే తొలి శుభగ డియ.

ఆ శుభగడియకే బలముంటే జీవితాంతం ఒకరికొ కరం...

నిరీక్షణతో...

మీ దేవి"

విజయేంద్ర ఉత్తరాన్ని తన్మయంగా ముద్దు పెట్టు కుని, జత పరచిన ఫోటో పరిశీలించాడు.

అందమైన వాలుజడ, జడనిండా కనకాంబరాలు. తెల్లగా మెరిసిపోతున్న వీపు. ఆకర్షణీయమైన నడుం... కానీ ముఖం కనపడకుండా అటు తిరిగి ఆర్టిస్టిగా తీయించుకున్న ఫోటో!

కాలెండర్ చూశాడు. ఆ రోజు శుక్రవారం.

"హూc! అంటే ఇంకా రెండు రోజులు... నలభై ఎనిమిది గంటల సుదీర్ఘ నిరీక్షణ... తప్పదు... తప్ప దు!" డీలాపడిపోతున్న మనసుకు ఉత్సాహాన్ని అందించుకున్నాడు.

ఆదివారం సాయంత్రం ఆరు గంటలు.

విజయేంద్ర మళ్లీ బ్లూకలర్ షర్టును, వైట్ ఫాంట్‌లో ఇన్‌చేసి ట్రిమ్‌గా తయారై లవర్స్ పార్కుకు వచ్చాడు.

విజయేంద్ర కళ్లూ ఆత్రంగా వెదికాయి.

ప్చ్! ఎక్కడా స్కైబ్లూకలర్ షిఫాన్ చీర లేదు. "పోనీ ఆలస్యమయిందేమో, వెయిట్ చేద్దాం" చూపులన్నీ అటువైపు కేంద్రీకరించి వచ్చికలో కూలబడ్డాడు.

> శీను: అరే రాజూ! రాజేష్ రెగ్యులర్‌గా గుడికి వచ్చేవాడు కదూ? మరిప్పుడేం చేస్తున్నా డు?
>
> రాజు: 'చెప్పుల షాప్ పెట్టాడు'
>
> చిలువేరు మృత్యుంజయ, భూదాన్‌పోచంపల్లి

ఆంక్షయిటీ... నెర్వస్‌నెస్... అనీజీ ... అసహనం... వీటన్నిటినీ అధిగమిస్తూ మాటలకందని ఏదో థ్రిల్!

ఐదు - పది - ఇరవై - అరగంట గడిచింది. ఏ అమ్మాయీ పార్కులోకి రాలేదు. విజయేంద్రకు ఒక్కసా రిగా ఏడుపు ముంచుకు వచ్చింది. అయినా తమా యించుకున్నాడు. అప్పుడు వినపడింది వీణానాదం.

"హలో...!"

విజయేంద్ర తలతిప్పి చూశాడు. జ్యోత్స్న! పక్కన ఎవరో మరో అమ్మాయి.

"హలో విజయేంద్రగారూ! ఒక్కరే కూర్చున్నారేం. ఎవరి గురించైనా వెయిట్ చేస్తున్నారా?"

"అబ్బెబ్బే... ఊరకే! ఏమీ తోచక ఇలా వచ్చా... కూర్చోండి."

"వీరు విజయేంద్రగారు. వర్ధమాన రచయిత!"

"నమస్తే." ఆ అమ్మాయి వినయంగా, అందంగా చేతులు జోడించింది.

"ఈ అమ్మాయి నా ఫ్రెండ్ అపర్ణ. ఎమ్మే చేస్తోంది." అప్పుడు గమనించాడు విజయేంద్ర వారు ధరించిన చీరల్ని. తెల్లని చీరలో దేవకన్యలా జ్యోత్స్న. పచ్చని చీరలో వనలక్ష్మిలా అపర్ణ. ఇద్దరి జడల్లోనూ పూలులేవు.

"విజయేంద్రగారూ!"

"ఆc!"

"అయ్యో, ఇదేమిటి పరధ్యానంలో వడ్డారు. కొంపదీసి ప్రేమలో పడలేదు కదా!" కోటి వీణల నవ్వడిలా నవ్వింది జ్యోత్స్న.

ఆ నవ్వు విజయేంద్ర మనసును దూదిపింజలకన్నా తేలిక పరచింది. తన మనసులోని ఆందోళనను, ఆతుర తను మర్చిపోయేలా చేసింది.

జ్యోత్స్న అపర్ణ అందాలతో, వారి అందమైన కబు ర్లతో ఆ సాయంసంధ్యకే ఓ వింత అందం వచ్చినట్లుగా ఫీలయ్యాడు విజయేంద్ర.

గంట గడిచినా 'అభిమాని' దర్శనమే కాలేదు.

బరువెక్కిన హృదయంతో ఇంటికి నడిచాడు.

రెండు రోజుల తర్వాత - ప్రత్యూష పవనంలా మరో గులాబీరంగు కవరు.

"డియర్!

క్షమించగలరా మీ దేవిని.

నాకు తెలుసు మీ మనసు నవనీతం. నా తప్పు తప్పక మీరు క్షమించగలరు. తల్లిదండ్రుల చాటు అమ్మాయిని. ఎన్నో ఆంక్షలు, కట్టుబాట్లు. అందుకే ఆదివారం సాయంత్రం మిమ్మల్ని నిరాశకు గురిచేసిన దౌర్భాగ్యురాలిని, అదృష్టహీనను. భౌతికంగా నేను గదిలో చిక్కువడ్డా, నా మనసు మాత్రం పార్కులో మీతోనే గడిపింది.

మరో చిన్న రిక్వెస్టు.

రేపు సాయంత్రం ఐదింటికి బీచికి రాగలరా? నాకు తెలుసు మీరు తప్పక వస్తారు. పడమటి సంధ్యకాంతుల్లో అందమైన మన కలయిక అనురాగ రాగరంజితం కావాలను నా ఆకాంక్ష.

సంధ్యాకాంతలా కనకాంబరం రంగు చీరలో సము ద్రానికి చేరువగా, ఏకాంతంగా మీ అపూర్వ ఆగమనం కోసం వేయి కన్నులతో నిరీక్షిస్తాను.

- మీ దేవి."

సాయంకాలం ఐదు గంటలు!

విజయేంద్ర బీచిలో నడుస్తున్నాడు. మనసంతా ఉద్విగ్నంగా ఉంది. ఆలోచనలు కడలి కెరటాల్లా ఎగ సిపడుతున్నాయి మనోసముద్రంలో.

అప్రయత్నంగా కాళ్లు ఆగిపోయాయి.

కళ్లు ఆనందంతో విప్పారాయి.

మనసు మయూరమై నాట్యం చేసింది.

సముద్రతీరంలో - కనకాంబరం రంగు చీరలో సంధ్యాకాంతలాంటి అందమైన అమ్మాయి. ఆ అందాల బొమ్మ అటు తిరిగి సముద్రంకేసి చూస్తోంది. వీపుపై అందమైన వాలుజడ. జడనిండా కనకాంబరా లు.

విజయేంద్ర మనసులో దేవి పంపిన ఫోటో మెది లింది.

"అవును... దేవి... దేవే... నా దేవే!"

చకచకా నడిచాడు. పరవశంతో గుండె లయ తప్పు తోంది.

ఆ అందాల బొమ్మ ఇటు తిరిగింది.

అంతే!!

విజయేంద్ర షాక్ తిన్నాడు.

ఆమె జ్యోత్స్న!

"మీ... మీరు... మీరు..." విజయేంద్ర గుండె గొంతు కలో కొట్లాడింది.

"ఎస్ డియర్, మీ దేవినే... జ్యోత్స్నాదేవిని!"

విజయేంద్ర కన్నుల్లో కోటి వెలుగులు.

జ్యోత్స్న గుండెలో శతకోటి వీణానాదాలు.

★ ★ ★

శోభనం రాత్రి...

గుండెలో జ్వలించే కోర్కెల జ్వాలలు కాస్త ఉపశ మించిన తర్వాత "డియర్ దేవీ! ఈ భక్తునిలో ఏం చూసి కరుణించావు..." జ్యోత్స్న చెవిలో గుసగుసగా అడిగాడు వర్ధమాన రచయిత విజయేంద్ర.

"అయ్యో! మిస్టర్ విజయేంద్రగారూ! ప్రతి వర్ధ మాన రచయితకు కొండంత భావుకతతో పాటు, కొంత 'బలహీనత' కూడా ఉంటుంది. లక్షల కట్నాలనిచ్చి మార్కెట్‌లో భర్తలను కొనుక్కోలేని మావంటి మధ్యతర గతి అమ్మాయిలు కాస్తంత ధైర్యం చేసి మీ వంటి భావుకులను ఆకర్షించుకోకతప్పదు. మీ రచనలమీద అభిమానం కురిపిస్తే పొంగిపోవడం మీ గొప్ప బలహీ నత. ఆ బలహీనత కళామతల్లి మా కిచ్చిన వరం..."

జ్యోత్స్న తన మనసులోని భావాలను బయట పెట్ట లేదు... పెట్టదు కూడా!

"చెప్పనా?" చిరునవ్వుతో అడిగింది.

"ఊc.. చెప్పు!"

"మొదట మీ రచనల్ని... ఆ తర్వాత మిమ్ముల ను..." ఆరాధనగా చెప్పింది.

గుండు గురి తప్పలేదు. సూటిగా విజయేంద్ర గుండె ను తాకింది. జ్యోత్స్న జవాబులోని మొదటి మాటకు వర్ధమాన రచయిత మనసు ఒక్కసారిగా మేరుపర్వత మంతయింది. ●